సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 27 ၊ మార్చి ၊ 2024



సోమశిలలో 10.499 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 10.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2,100 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.68,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,156
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,341
నవర (8 గ్రాములు)	రూ.50,728

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.8 /25.4

మంగళవారం గాలిలో తేమ 55 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
6:26	4:52

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఒకటో యూనిట్‌లో 440 మెగావాట్లు, రెండో యూనిట్‌లో 520 మెగావాట్లు, మూడో యూనిట్‌లో 570 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు తెలిపారు.

ప్రచార అనుమతులు తప్పనిసరి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాల నిర్వహణ, మైక్ సెట్, ఆయా పార్టీల తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు, వాహనాల వినియోగం, ప్రదర్శనలు, అందులో ఉపయోగించే లౌడ్‌స్పీకర్లు, వీధి సమావేశాలు, గాలి బెలూన్ల ఏర్పాటు, అంతర జిల్లాల ప్రచార వాహనాలు, బారికేడ్ల ఏర్పాటు, మైకులు లేకుండా ఏర్పాటు చేసే సమావేశాలు, ఇంటింటి లేదా గడప గడపకు ప్రచారం చేయడానికి ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఆయా ప్రాంతాల ఎన్నికల అధికారి అనుమతి పత్రం కలిగి ఉండాలని, అధికారులు అడిగినప్పుడు సమర్పించాలని, అలా చేయకపోతే ఎన్నికల నియామవళి ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి



వరికుంటపాడు వద్ద సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచి మద్యం, నగదు అక్రమంగా రవాణా కాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఉదయగిరి, సీతారామపురం పోలీస్‌స్టేషన్లను, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. సీతారామపురంలోని నారాయణంపేట, చిన్నాగంపల్లి, వరికుంటపాడు వద్ద చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా వాటిలో 15 చెక్‌పోస్టులు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది 24 గంటలు వాహనాల తనిఖీ చేస్తారన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న దాదాపు రూ.10 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, అనూష, ఉమాశంకర్, తిరుపతయ్య ఉన్నారు.

బీఎస్‌ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్



నెల్లూరు(క్రైమ్): ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ కోరారు. నగరంలోని వేదాయపాళెం స్టేషన్ పరిధిలో ఉన్న వెంగళరావునగర్, గాంధీనగర్, శాంతినగర్, బుజబుజనెల్లూరు తదితర ప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్‌ను స్థానిక పోలీసులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఓటుపై విస్తృత చైతన్యం



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకుని వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. స్వీప్ కమిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్త ఓటర్లను నమోదు చేస్తున్నారు. ఈవీఎంలపై ముమ్మర ప్రచారం చేస్తున్నారు. గతంలో కన్నా ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.



ఈవీఎంలపై గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు

- ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా చర్యలు
- స్వీప్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం
- ఓటింగ్ శాతం పెంచడమే ప్రధాన లక్ష్యం

నెల్లూరు(దర్గామిట్ట): ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవడమే ప్రధాన లక్ష్యంగా జిల్లాలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కమిటీ విస్తృతంగా ఓటరు చైతన్య కార్యక్రమాలను చేపట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో గతంలో కన్నా ఓటింగ్ శాతాన్ని పెంచడం, ఓటర్లందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ పర్యవేక్షణలో స్వీప్ బృందాలు ఓటరు అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నాయి. జిల్లాస్థాయిలో కలెక్టర్ హరినారాయణన్ చైర్మన్‌గా, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి కన్వీనర్‌గా, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి నోడల్ అధికారిగా, వివిధ శాఖల అధికారులు సభ్యులుగా జిల్లాలో ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.



ర్యాలీ ద్వారా ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తున్న అధికారులు

అందరి భాగస్వామ్యంతో..

ప్రతి నియోజకవర్గంలో ఒక స్వీప్ నోడల్ అధికారిగా ఎంఈఓ, డీఈ, ఇద్దరు ఏపీఎంలు, 8 మంది నోడల్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు.

జిల్లాలో..

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు	బూత్ లెవల్ క్లబ్‌లు	క్యాంపస్ అంబాసిడర్లు
2,282	4,790	532 మంది

వీరికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవెల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి యూత్ ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను భాగస్వామ్యం చేస్తూ ఓటర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే ఈ క్లబ్‌ల ప్రధాన ఉద్దేశం.

సోషల్ మీడియా ద్వారా ప్రచారం

ఓటు ప్రాధాన్యం, వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేసే కార్యక్రమాలను చేపడుతున్నారు. క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే చేస్తూ దాన్ని స్కాన్ చేయగానే ఓటరు చైతన్య కార్యక్రమాలు ప్రసారమయ్యేలా రూపొందించారు. పోలింగ్ తేదీ మే 13ను తప్పకుండా గుర్తుంచుకోవాలని, తమ అభ్యర్థి గురించి తెలుసుకోవాలని పోస్టులు పెడుతూ ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. జిల్లాలో ప్రముఖ వెయిట్ లిఫ్టర్ కె.తులసి, సామాజిక కార్యకర్త అరుణకుమారి, ఇంటర్నేషనల్ కబడ్డీ ప్లేయర్ మహేష్‌బాబును జిల్లా ఐకాన్లుగా గుర్తించి వారి ద్వారా ఓటు విలువను తెలుపుతూ వీడియోలను ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేస్తున్నారు.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం



జిల్లాలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో 77.48 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ శాతాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా జిల్లాలో ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం. తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఈవీఎంలపై అవగాహన కల్పించాం.

– ఎం.హరినారాయణన్, కలెక్టర్

దూర ప్రాంత ఓటర్లకు ఫోన్ ద్వారా సమాచారం

ఓటింగ్ శాతం పెంచేందుకు 100 శాతం ఓటరు స్లిప్పులను డోర్ టు డోర్ అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఉద్యోగరీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా 'ఓటర్లకు వందనం' పేరుతో ఫోన్ ద్వారా వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో సమాచారం అందించి ఓటు హక్కు వినియోగించుకోవాలని చెబుతాం. కియోస్కోలను ఏర్పాటు చేసి తమ ఓటు ఎక్కడ ఉందో ఓటరు తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు, పోస్టర్ క్యాంపెయిన్, మానవహారాలు ఏర్పాటు చేసి ఓటు హక్కుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెల్లూరు నగరంలో ఎంజీ మాల్‌లో సెల్ఫీ బూత్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాం.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

వేసవిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా కార్యాచరణ

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వేసవిలో జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యాచరణను ముందుగానే రూపొందించుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు, వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, కందుకూరు, కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో రానున్న మూడు నెలల వరకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు నిల్వ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పనిచేయని బోర్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లోని నీటి నిల్వల్లో తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మిత, ఇరిగేషన్, తెలుగుగంగ ప్రాజెక్ట్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కృష్ణమోహన్, రమణారెడ్డి, ఎస్‌కే మర్ధన్‌అలీ, సోమశిల ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ ఈఈ సంజయ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంతియాజ్ మద్దతు సంతోషకరం



విజయసాయిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మదీనా వాచ్ షోరూం అధినేత ఇంతియాజ్ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వడం సంతోషకరమని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇంతియాజ్ ఆహ్వానం మేరకు నగరంలోని ఆయన నివాసానికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మరని, మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, నెల్లూరు సిటీ టికెట్ ఖలీల్ అహ్మద్‌కు కేటాయించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు.

వైభవంగా రంగనాథుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రంగనాథుడికి పూలంగిసేవ, ఎదుర్కోలు ఉత్సవాన్ని వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం రాత్రి ఒంటిగంటకు స్వామివారు గజవాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు.

'రంగనాథుడి' రథోత్సవం నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 8 గంటలకు పొన్నవాహన అలంకారోత్సవం జరగనున్నాయని ఈఓ తెలిపారు.

కావ్య.. ఇదేందయ్యా!

- అల్లూరులో టీడీపీ ఆఫీస్ తలుపులు పగులగొట్టించిన వైనం
- బయటపడుతున్న కావ్య నిజ స్వరూపం
- లోలోన ఉడికిపోతున్న నేతలు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ కావలి నియోజకవర్గ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి తీరుపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందే కావ్య నిజ స్వరూపం బయటపడుతుండడంతో భగ్గుమంటున్నారు. ఇప్పటికే కావ్య వైఖరితో కావలిలో 40 ఏళ్ల నుంచి టీడీపీ జెండా మోసిన కార్యకర్తలు, ఎన్టీఆర్ వీరాభిమానులు పార్టీకి దండం పెట్టి రాజీనామాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల అల్లూరులో టీడీపీ కార్యాలయం తలుపులను కావ్య కృష్ణారెడ్డి సాక్షిగా ఆయనతోపాటు పార్టీలోకి వచ్చిన అల్లూరులోని ఆయన బంధువులు కాళ్లతో తన్ని పగుల గొట్టిన ఘటన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడడం లేదు. వివరాలు.. ఇటీవల అల్లూరులో అంకమ్మ తిరునాళ్లకు కావ్య కృష్ణారెడ్డి చందా ఇవ్వడంతో ఆయనను ఆహ్వానించారు. కావ్య అల్లూరుకు వస్తున్నారని తెలియడంతో ఆయన కోసం అల్లూరు లోని పార్టీ కార్యాలయంలో రాత్రి 11 గంటల వరకు నాయకులు, కార్యకర్తలు ఎదురుచూశారు. ఎంతకూ రాకపోవడం, ఫోన్‌లకు స్పందించక పోవడంతో కార్యకర్తలు కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో అల్లూరుకు చేరుకున్న కావ్య కృష్ణారెడ్డి పార్టీ ఆఫీసుకు తాళం వేసి ఉండడంతో అసహనానికి గురై తనతో వచ్చిన తన వర్గీయులతో తలుపులు పగులగొట్టించాడు. తరువాత పార్టీ ఆఫీసులో కూర్చుని గంటసేపు స్థానిక రాజకీయాలపై అల్లూరుకు చెందిన తన దూరపు బంధువులతో చర్చలు జరిపాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు ఒక్కసారిగా కలవరపాటుకు గురయ్యారు. పార్టీ కార్యాలయం తలుపులనే పగులగొట్టించిన వ్యక్తి ప్రజలను ఏం గౌరవిస్తాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తికి మద్దతుగా తిరగడం మావల్ల కాదంటూ చేతులెత్తేశారు. విషయం బయటకు వస్తే పార్టీ పరువుపోతుందనే ఉద్దేశంతో బీద గిరిధర్ వర్గీయులు గుట్టుచప్పుడు కాకుండా కొత్త తలుపును ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం అల్లూరులో ఈ ఘటన హాట్ టాపిక్‌గా మారింది.



అల్లూరులోని టీడీపీ కార్యాలయంలో పగులగొట్టిన తలుపు చెక్కలు

పైకి సఖ్యత.. లోన కుతకుత

- ఉదయగిరి టీడీపీలో వర్గపోరు
- కాకర్లకు సహకరించని బొల్లినేని వర్గీయులు
- ప్రచారానికి దూరంగా ఉంటూ దెబ్బ తీసేందుకు లోలోన ప్లాన్
- ఇంటిపోరుతో సతమతమవుతున్న కాకర్ల



ఉదయగిరి: ఉదయగిరిలో టీడీపీ పరిస్థితి చూస్తే పైకి సాఫీగా కనిపిస్తున్నా లోలోన ఆ పార్టీ నేతలు ఒకరికొకరు కత్తులు దూసుకుంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని వెంకట రామారావుకు సీటు ఇవ్వకుండా.. ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్‌కు ఉదయగిరి టికెట్ ప్రకటించడంతో బొల్లినేని వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో బొల్లినేని తన అనుచరులతో బహిరంగ సమావేశం నిర్వహించి చంద్రబాబు తీరును బహిరంగంగానే విమర్శించి డబ్బుసంచులకు అమ్ముడుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధినేత ఆదేశాల మేరకు బీద రవిచంద్ర బొల్లినేనిని ప్రసన్నం చేసే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను చేసిన మేలును మరిచి తనకు అన్యాయం చేశారంటూ బొల్లినేని ఆవేదన వ్యక్తం చేసి గత నెల రోజులుగా నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. దీంతో బొల్లినేని అనుచరులు కొంతమంది పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండగా.. మరికొందరు అంటీముట్టనట్లు ఉంటున్నారు.

కుదరని సయోధ్య

బొల్లినేని అధినేత చంద్రబాబును కలవడంతో సమస్య సమసిపోయినట్టే అని పార్టీ క్యాడర్ భావించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాకర్ల సురేష్‌ను కలిసేందుకు బొల్లినేని ఇష్టపడడం లేదు. ఇటీవల తిరుపతి గెస్ట్‌హౌస్‌లో ఉన్న బొల్లినేనిని కలిసేందుకు కాకర్ల సురేష్ అక్కడకు వెళ్లినా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో మనస్తాపంతో వెనక్కి వచ్చినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాకర్ల ఆత్మీయ సమావేశాల పేరుతో మండల కేంద్రాల్లో సభ లు ప్రారంభించగా.. బొల్లినేని లేకుండా తాము సమావేశాలకు రాలేమని కొంతమంది నేతలు చెప్పడంతో సభలు నిర్వహించడం ఆపేశారు. ఓవైపు బొల్లినేని సహకరించకపోవడం.. మరోవైపు నియోజకవర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ విస్తృతంగా ప్రజల్లోకి చొచ్చుకుపోతుండడంతో కాకర్ల వర్గీయులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

గ్రూపు రాజకీయం

ప్రతి మండలంలో టీడీపీలో రెండు నుంచి ఐదారు గ్రూపులు ఉన్నాయి. వీటిని సమన్వయం చేసుకోవడం ఆ పార్టీ అభ్యర్థి కాకర్లకు తలకు మించిన భారంగా మారింది. దుత్తలూరు మండలంలో బొల్లినేని వర్గీయులు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి వర్గీయులు రెండు గ్రూపులుగా ఉన్నారు. వింజమూరులో బొల్లినేని, కాకర్ల, ప్రస్తుత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గ్రూపులు ఉన్నాయి. కలిగిరిలో బొల్లినేని వర్గీయులకు, కాకర్ల వర్గీయులకు పొసగడం లేదు. జలదంకి మండలంలో కాకర్ల వర్గీయులు, బొల్లినేని, కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి గ్రూపులు ఉండగా.. తాజాగా ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేవూరు జనార్దన్‌రెడ్డి వర్గీయులు హడావుడి చేస్తున్నారు. దీంతో ఎవరికి ప్రాధాన్యం ఇవ్వాలో అర్థంకాక కాకర్లకు తల బొప్పికడుతోంది. పైగా ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రూపు మరో సమస్యగా మారింది.

కాకర్లను ఓడించేందుకు ఎత్తులు

కాకర్ల ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే నియోజకవర్గంలో తనకు, తన కుటుంబసభ్యులకు మనుగడ ఉండదని భావించిన బొల్లినేని.. కాకర్లను ఓడించేందుకు పక్కా ప్లాన్‌తో ఉన్నట్లు ఆ పార్టీలో అంతర్గతంగా చర్చ సాగుతోంది. పార్టీని విభేదించకుండా, బయటపడకుండా కాకర్లని ఓడించి ఇంటికి పంపే వ్యూహరచన చేస్తున్నట్లు ప్రచారం ఉంది. దీంతో ఆయా మండలాల్లో బొల్లినేని వర్గీయులకు పూర్తి స్థాయిలో పెత్తనం అప్పజెప్పకుండా కాకర్ల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ పరిణామంతో బొల్లినేని అనుచరులు కాకర్లపై మరింత గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. కాకర్ల నుంచి పెద్ద మొత్తంలో ప్యాకేజీ వస్తుందని కొంతమంది ఆశించినా.. ఆ పరిస్థితి లేకపోవడంతో గుట్టుచప్పుడు లేకుండా కాకర్లను దెబ్బతీసేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద ఉదయగిరిలో టీడీపీ దుస్థితి చంద్రబాబుకు టెన్షన్‌గా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

క్లుప్తంగా

అనుమతి తప్పనిసరి : కలెక్టర్


హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ఇవ్వాలంటే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీరు ముందస్తు అనుమతి ఇస్తారన్నారు. పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్టరైన పార్టీలు రెండు రోజుల ముందు, రిజిస్టర్ కాని వారు ఏడు రోజుల ముందుగా ప్రకటనలపై దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, ముందురోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొంది ప్రకటనలు ప్రచురించాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియా, సినిమా హాళ్లలో, ప్రైవేట్ ఎఫ్ఎం తదితర చోట్ల ప్రకటనలు ఇచ్చేందుకు ముందస్తు ధ్రువీకరణపత్రం పొందాలన్నారు.

ఎండు పొగాకు కోసం వెళ్తుండగా..

- మహిళా కూలీ ప్రాణం తీసిన ట్రాక్టర్
- కుటుంబంలో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

కందుకూరు రూరల్: ఎండు పొగాకు ఏరుకునేందుకు బయలుదేరిన మహిళా కూలీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మోపాడు గ్రామం వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కందుకూరులోని శ్రీరామ్ నగర్‌కాలనీకి చెందిన తొమ్మిది మంది మహిళలు వలేటివారిపాళెం మండలం నదలదపూరు గ్రామ పొలాల్లో ఎండు పొగాకు సేకరించేందుకు ఆటోలో బయలుదేరారు. మోపాడు వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న పొగాకు ట్రాక్టర్ డోర్ ఆటోకు తగిలింది. దీంతో అది పక్కనే ఉన్న కాలువలో పడింది. ఆటో వెనుక వైపు కూర్చొని ఉన్న డాలు లక్ష్మి (45) అనే మహిళ తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. బి.లక్ష్మి, కె.ఉమ అనే వారు స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పొగాకు చెక్కుల ట్రాక్టర్ నలదలపూరు గ్రామానికి చెందినదిగా చెబుతున్నారు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. కాగా లక్ష్మికి భర్త, ముగ్గురు పిల్లలున్నారు.

కన్నీరుమున్నీరుగా..

లక్ష్మి భర్త హరిబాబు డయాలసిస్ పేషెంట్. రోజు మార్చి రోజు కందుకూరులో డయాలసిస్ చేయించుకుంటుంటాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో వారి కుమారుడు చదువు మానేసి బేల్దారి పనులకు వెళ్తున్నాడు. పెద్ద కుమార్తె ఒంగోలులో హాస్టల్లో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మరో కూతురు కందుకూరులోనే తొమ్మిదో తరగతి చదువుతోంది. లక్ష్మి కూలి పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉంది. ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో ఎండు ఆకు తెచ్చి విక్రయించేందుకు కాలనీలోని మహిళలతో కలిసి బయలుదేరింది. ఆమె మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

విశ్రాంత ఇంజినీర్ రాజగోపాలయ్య కన్నుమూత


రాజగోపాలయ్య (ఫైల్)

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నీటిపారుదల శాఖలో ఈఈగా సుదీర్ఘకాలం పని చేసి రైతుల మన్ననలు పొందిన పార్లపల్లి రాజగోపాలయ్య (92) సోమవారం కన్నుమూశారు. ఈయన గతంలో నెల్లూరులోని రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కు పెద్దమొత్తం విరాళంగా అందజేశారు. రాజగోపాలయ్య వారసులు విద్యాసంస్థలను నెలకొల్పారు. ఆయన కుమార్తె, కుమారుడు అమెరికాలో స్థిరపడ్డారు. అంత్యక్రియలు గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 274
లేయర్ చికెన్	: 125

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.68
పండ్లు	: రూ.25

సర్వేపల్లి బరిలో మళ్లీ వారే..

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- తెలుగుదేశం నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- ఇప్పటికే కాకాణి చేతిలో రెండు పర్యాయాలు సోమిరెడ్డి ఓటమి
- వైఎస్సార్‌సీపీలోకి వెల్లువెత్తుతున్న వలసలు


కాకాణి గోవర్ధన్‌రెడ్డి


చంద్రమోహన్‌రెడ్డి

పొదలకూరు: జిల్లాలో సర్వేపల్లి నియోజకవర్గానికి అనేక ప్రత్యేకతలున్నాయి. విస్తారంగా సముద్ర తీరం ఉంది. వేలామందికి ఉపాధి కల్పిస్తున్న కృష్ణపట్నం పోర్టు ముత్తుకూరు మండలంలో ఉంది. దాని ఆధారంగా అనేక పరిశ్రమలున్నాయి. సర్వేపల్లిలో రాజకీయాలు హాట్‌హాట్‌గా ఉంటాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉంటారని ఎప్పుడో నిర్ణయమైంది. అయితే టీడీపీ నుంచి ఎవరు పోటీ చేస్తారోనని కొద్దిరోజులు ఉత్కంఠ నెలకొంది. దీనికి చంద్రబాబు నాయుడు తెరదించారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికే అవకాశం కల్పించారు.

మూడోసారి

పాత ప్రత్యర్థులైన మంత్రి కాకాణి, సోమిరెడ్డిల మధ్య మూడో పర్యాయం పోటీ నెలకొంది. జిల్లాలో చూస్తే పాతకాపుల మధ్య పోటీ సర్వేపల్లిలోనే నెలకొనడం విశేషం. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కాకాణి, టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి తలపడ్డారు. కానీ కాకాణి విజయం సాధించారు. 14లో 5,500 ఓట్లు, 19లో 14 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో ఓడినా సోమిరెడ్డిని చంద్రబాబు ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి కూడా ఇచ్చారు. ఆయన పదవిని అడ్డు పెట్టుకుని 2019 ఎన్నికల్లో సర్వేపల్లి బరిలో నిలబడి అస్త్రశస్త్రాలు ప్రయోగించి మంచి నీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టారు.

అదే బలం

కాకాణి సొంత మండలం పొదలకూరు ఆయనకు కంచుకోట. దీనిపై సోమిరెడ్డి మంత్రి హోదాలో ఫోకస్ పెట్టి ఎన్నో రాజకీయ విన్యాసాలు చేశారు. కాకాణి స్వగ్రామం తోడేరులో ఒకరిద్దరిని ప్రలోభపెట్టి తనవైపు తిప్పుకున్నా తర్వాత వారు సొంత గూటికే చేరుకున్నారు. 2019లో ఎన్ని కుయుక్తులు పన్నినా ఒక్క పొదలకూరు నుంచి కాకాణి సోమిరెడ్డిపై 4,700 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇప్పుడు కూడా సోమిరెడ్డి పొదలకూరు మండలంపైనే తన దృష్టిని నిలిపి గోవర్ధన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు.

క్యూ కట్టి..

సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి వలసలు పెరిగాయి. ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, తోటపల్లిగూడూరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి క్యాంపు కార్యాలయానికి క్యూ కట్టి మరీ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. వారిని సోమిరెడ్డి నిరోధించలేకపోతున్నారు. దీంతో తమ పార్టీకి చెందిన వారికే కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి వలసలని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేగంగా అభివృద్ధి

అధికార పార్టీ ఎమ్మెల్యేగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లిలో అభివృద్ధి పనులు వేగంగా చేశారు. పల్లెల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం జరిగింది. మౌలిక వసతులు కల్పించారు. పంటలకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భూపట్టాల పంపిణీ, చుక్కల భూముల సమస్యల పరిష్కారం, పరిశ్రమల స్థాపన, నాన్‌ఫిషన్‌మెన్ ప్యాకేజీ తదితర పనులను పూర్తి చేశారు. దశాబ్దాల నాటి సమస్యలకు గడప గడపకు మనప్రభుత్వంలో మంత్రి పరిష్కారం చూపారు. దీంతో సర్వేపల్లిలో మరోసారి కాకాణి విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జనరంజక పాలన అందించాం.. ఆదరించండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి కాకాణి, చిత్రంలో గురుమూర్తి

తోటపల్లిగూడూరు: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలి' అని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని చింతోపు, ముంగళదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో మంగళవారం కాకాణి.. తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి మద్దెల గురుమూర్తి కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రచార ఆర్భాటంతో శంకుస్థాపనలు చేసి పనులను విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శంకుస్థాపన చేసిన ప్రతి పనిని పూర్తి చేసి ప్రారంభించామన్నారు. గ్రామ స్థాయి నుంచే సుపరిపాలన అందించేందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక పింఛన్లు అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మీ కుటుంబంలో మేలు జరిగితేనే నాకు ఓటు వేయాలని ధైర్యంగా చెబుతున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలన్నారు. అనైతిక పొత్తుతో ఎన్నికలకు వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీని మట్టి కరిపించాలన్నారు. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. గురుమూర్తి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన జగనన్నను మరోదఫా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజకవర్గాన్ని ఉన్నత స్థానంలో నిలిపిన కాకాణిని మూడోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నాయకులు లేబూరు మల్లికార్జున్, కోనేటి రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి

- ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్


మాట్లాడుతున్న ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అన్ని నియోజకవర్గాల్లోన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధిత సెక్షన్ ఆఫీసర్లు వెళ్లి పరిశీలించాలని, విద్యుత్ పనులపై నివేదిక పంపాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్ నుంచి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోడల్ ఆఫీసర్లు వారికి నిర్దేశించిన సెక్షన్లలో విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీలకు విడుదలైన నిధుల నుంచి బకాయిలను రాబట్టాలన్నారు. వేసవి కాలంలో పెరుగుతున్న వినియోగానికి తగినట్లుగా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలో వర్క్ ఆర్డర్స్ చాలా పెండింగ్‌లో ఉన్నాయని ఈనెలాఖరులోగా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈ (టెక్నికల్) శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

కోవూరు ప్రజలంతా నా కుటుంబసభ్యులే

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'కోవూరు నియోజకవర్గ ప్రజలంతా నా కుటుంబసభ్యులే. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించండి' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్యను ఆయన నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకారం అందించినట్లు చెప్పారు. ఈ ఊరిలో ఓ నాయకుడిని సొంత తమ్ముడిగా చూసుకున్నానని, కానీ వదిలి వెళ్లిపోయాడని దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డిపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. బహుశా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధనవంతుడని వెళ్లి ఉంటాడన్నారు. ఎన్నికలు వచ్చే సమయానికి కొందరు డబ్బున్న వారి వద్దకు వెళ్లిపోతున్నారన్నారు. మంచి పనులు చేసి ప్రజల్లో పేరు తెచ్చుకోవాలని, తప్పుడు పనులు చేయొద్దని హితవు పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఏ పని కావాలన్నా నేరుగా తనను కలవాలని, చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. లబ్ధి పొందిన వారందరూ ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ కమిటీ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, ఉడతా వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: 'ప్రజలను మోసం చేయడం ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడి నైజం. గతంలో రుణమాఫీ పేరుతో రైతులు, పొదుపు మహిళలను నట్టేట ముంచారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుప్పురుపాడులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి చిన్న గ్రామమైన కుప్పురుపాడుకు గత ప్రభుత్వం రూ.50 లక్షలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.5 కోట్లను వివిధ వాటికి వెచ్చించినట్లు తెలిపారు. ఇది వాస్తవం కాదా అని ప్రజలు తెలుసుకోవాలన్నారు. నిజమైతేనే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని ఆయన ఓటర్లను కోరారు. గ్రామంలోని రైతుల కోసం ఉత్తరకాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి తద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక మేనిఫెస్టోను తయారుచేసి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపినట్లు తెలిపారు. జన్మభూమి కమిటీలతో నష్టపోయిన ప్రజలకు వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలు అందించామన్నారు. వలంటీర్లను టీడీపీ నాయకుడు ఉగ్రవాదులతో పోల్చడం దారుణమన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందేందుకు కృషి చేశామన్నారు. ప్రతి ఇంట్లో బిడ్డలు చదువుకునేందుకు అమ్మఒడి పథకం ఎంతగానో తోడ్పడిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, నాయకులు డాక్టర్ ప్రణీత్, శ్రీనివాసులునాయుడు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతికి మద్దతు ఇవ్వండి

- నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి


ఆదాలకు హారతి ఇస్తున్న మహిళలు

నెల్లూరు సిటీ: 'రానున్న ఎన్నికల్లో పెత్తందారులను దూరం పెట్టండి. పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వండి' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్‌లోని 29వ డివిజన్ గాంధీనగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేస్తే మతతత్వానికి చోటు ఇవ్వడమేనన్నారు. జనసేనకు ఓటు వేస్తే వలంటీర్ల వ్యవస్థ రద్దుకు మద్దతు ఇచ్చినట్లేనని చెప్పారు. ఆ రెండు పార్టీలతో పొత్తులో ఉన్న తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే టోటల్‌గా గ్రామ సచివాలయ వ్యవస్థ రద్దుకు అవకాశం ఇచ్చినట్లేనన్నారు. గతంలో ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు సచివాలయాల ద్వారా చాలా సులువుగా పథకాలు అందుతున్నాయన్నారు. అందువల్ల ప్రజలందరూ ఆలోచించాలని కోరారు.

యువకుల చేరిక

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగానికి చెందిన షేక్ జాకీర్ ఆధ్వర్యంలో 20 మంది యువకులు ఆదాల సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని తెలిపారు. ఇంకా 29వ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్, వీఎంఆర్ నగర్ ప్రాంతంలోని జనసేన, టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కార్పొరేటర్ డాక్టర్ షేక్ సత్తార్, జేసీఎస్ కన్వీనర్ కొండాసాయిరెడ్డి, నాయకులు సూరిబాబు, వెంకటజ్యోతి, రావుల అమర్నాథ్, మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండను పూర్తి చేసిన ఘనత జగన్‌దే

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: 'చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు చేయలేకపోయారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక మెట్ట ప్రాంతాల ప్రజల కోసం ఆ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులిచ్చి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మరణం తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వెలిగొండను పూర్తి చేసిన ఘనత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏపిలగుంటలో మంగళవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వేగంగా నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఏపిలగుంట హజరత్‌రెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, జయరామయ్య, మౌలాలీ, ఖాదర్‌బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీపై డీఎస్పీ ఆరా

కోవూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన చోరీ ఘటనపై నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి మంగళవారం ఆరా తీశారు. ఆదివారం అర్ధరాత్రి షాపులో దొంగలు పడి రూ.8.70 లక్షలు చోరీ చేశారు. మంగళవారం డీఎస్పీ ఆ దుకాణాన్ని పరిశీలించారు. వాచ్‌మెన్ కె.మల్లికార్జునతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట కోవూరు సీఐ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ హేమలత, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.

